## బదిలీ పోలీసులకు ఘన సన్మానం


# పెన్ పవర్
రాయలసీమ
శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా । తిరుపతి । చిత్తూరు । వై.ఎస్.ఆర్. కడప


**పెన్ పవర్,ప్యాపిలి:** స్థానిక పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వహిస్తూ ఇటీవల బదిలీ అయినా ఏఎస్సై వెంకటేశ్వర్లు కర్నూలు జిల్లాకు, ఎం.వెంకటరాముడు ఆత్మకూరు టౌన్ పోలీస్‌స్టేషన్‌కు బదిలీ అయ్యారు. శనివారం ఈ సందర్భంగా ఎస్సై నాగార్జున ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది వారిద్దరికీ ఘనంగా సన్మానించారు. సేవాకాలంలో ప్రజలకు అందించిన సేవలను కొనియాడుతూ శాలువాలు కప్పి జ్ఞాపికలు అందజేశారు. నూతన విధి నిర్వహణ స్థానాల్లోనూ సమర్థవంతంగా సేవలందించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది, అధికారులు పాల్గొన్నారు.




# వైసిపి తలపెట్టిన గుడ్ మార్నింగ్ కార్యక్రమంలో ఇరు వర్గీయులు ఘర్షణ





**పెళ్లకూరు, పెన్ పవర్, జూలై 11 :** రాష్ట్ర వైసిపి ప్రధాన కార్యదర్శి, సెంట్రల్ బ్యాంక్ మాజీ చైర్మన్ కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి శనివారం రావులపాడు లో తలపెట్టిన " గుడ్ మార్నింగ్" కార్యక్రమం ఘర్షణ వాతావరణానికి దారి తీసింది. ఆయన రానున్న ఎన్నికల దృష్ట్యా పెళ్లకూరు మండల గ్రామపంచాయతీ, ఎంపీటీసీ, జడ్పిటిసి ఎన్నికల్లో పట్టు సాధించే నిమిత్తం గత వారం క్రితం గ్రామ ప్రజలను పలుకరిస్తూ కొన్ని గ్రామాల్లో ఈ కార్యక్రమాన్ని పూర్తి చేశారు. అదే పంథాలో శనివారం కామిరెడ్డి తన పార్టీ అనుచరులతో గుడ్ మార్నింగ్ ప్రోగ్రాం నిర్వహించేందుకు రావులపాడు గ్రామానికి వెళ్లే ప్రయత్నంలో టిడిపి మండల పార్టీ అధ్యక్షులు సంచి కృష్ణయ్య, పేరం రమేష్ నాయుడు, చైతన్య కృష్ణారెడ్డి 100కు పైగా వచ్చిన కార్యకర్తలతో గుడ్ మార్నింగ్ ప్రోగ్రామ్ ని అడ్డుకున్నారు. ఒక్కసారిగా టిడిపి వర్గం ఆయన వాహనంపైకి దూసుకు రావడంతో అటు వైకాపా, తోపులాటలు చోటుచేసుకున్నాయి. కామిరెడ్డిని వాహనం నుండి దిగనీయకుండా కారును అడ్డగించి ఈ గ్రామంలో నీవు తలపెట్టిన గుడ్ మార్నింగ్ ప్రోగ్రాం కు అనుమతులు ఉన్నాయా! ఎట్టి పరిస్థితుల్లో నీకు అవకాశం లేదు తిరిగిపోండిని హెచ్చరించారు. వైకాపా కార్యకర్త కొంత నోరు జారడంతో అతనిపై దాడి చేసేంత పరిస్థితి నెలకొంది. ఆయనకు మద్దతుగా నిలబడిన రావులపాడు వైకాపా కార్యకర్తలు టిడిపి నాయకుల మధ్య సవాల్.. ప్రతి సవాల్ వంటి మాటల తూటాలు పేలాయి. ఆయన్ను మా ఇంటికి ఆహ్వానించాము మీరెవరు ఆపేందుకు అంటూ టిడిపి నాయకులను అడ్డుకునే ప్రయత్నంలో తీవ్రస్థాయి ఘర్షణ లేదు, శుక్రవారం రాత్రి మీకు నోటిసు వాట్సప్ కు జారీ చేశాం, వివాదాలకు, ఘర్షణలకు కారణం కాకుండా వెళ్లిపోండని ఆదేశాలు జారీ చేశారు. ఇలాంటి పరిస్థితులు పెళ్లకూరు మండల ప్రజలు ఏం జరుగుతుందని చర్చించుకుంటున్నారు. నియోజకవర్గంలోని 6 మండలాలు ఉన్నా పెళ్లకూరు మండలంలో మాత్రం ప్రతిపక్ష, పాలకపక్ష నాయకుల మధ్య వివాదాలు జరుగుతూనే ఉన్నాయి. సవాల్ కు ప్రతి సవాల్ విసరడం తో పెళ్లకూరు మండలంలో రాజకీయ అనిశ్చిత కనిపిస్తోంది. రాబోవు ఎన్నికల్లో ఓటర్లు ఎటువైపు మొగ్గు చూపుతారో కాని పార్టీ పట్టు కోల్పోతుందని ఎవరి ప్రయత్నాలు వారు చేస్తున్నారు.

## కుమార్ రెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించిన ఎమ్మెల్యే సోమిరెడ్డి,మాజీ ఎంపీ నెలవల



**నాయుడుపేట, పెన్ పవర్, జూలై 11 :** సీనియర్ రాజకీయ నాయకులు మాజీ ఎన్డీసీసీబీ డైరెక్టర్ డాక్టర్ వి పి కుమార్ రెడ్డి కుటుంబ సభ్యులను సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి,మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం లు పరామర్శించారు.డాక్టర్ వి పి కుమార్ రెడ్డి అనారోగ్యంతో బాధపడుతూ శుక్రవారం సిమ్స్ హాస్పిటల్ లో కన్నుమూసిన విషయం తెలిసిందే. కాగా సమాచారం తెలుసుకున్న ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి,మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం లు శుక్రవారం నాయుడుపేట పట్టణంలోని కుమార్ రెడ్డి నివాసానికి చేరుకుని ఆయన కుటుంబ సభ్యులైన ప్రతిమ రాజేశ్వరి,సునీల్ కుమార్ రెడ్డి,ప్రభావతమ్మ సుధీర్ రెడ్డిలను పరామర్శించారు.భగవంతుడు వారికి మనోధైర్యాన్ని ప్రసాదించాలని ఆకాంక్షించారు. అలాగే వారి వెంట ఉన్న నాయుడుపేట పట్టణ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు షేక్ రఫీ,మాజీ జడ్పిటిసి సభ్యులు పేరంశెట్టి శ్రీరాం ప్రసాద్, తెలుగుదేశం పార్టీ నాయకులు కందల కృష్ణారెడ్డి,కే గోపాల్ రెడ్డి పట్టణ ప్రధాన కార్యదర్శి అవధానం సుధీర్,శ్రీ పోలేరమ్మ ఆలయ కమిటీ చైర్మన్ నానబాల సుబ్బారావు,క్లస్టర్ ఇంచార్జి సర్వోత్తమ రెడ్డి,ఏఎంసి వైస్ చైర్మన్ కిలారి గోపాలకృష్ణ,నాయకులు జి.వి. ఆర్ నాయుడు,జువ్వలపాటి మస్తాన్,ఇమ్మిడిశెట్టి వెంకటేశ్వర్లు వాకిరి వెంకటేశ్వర్లు,కాలేషా పలువురు నాయకులు కుమార్ రెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

## బిడ్డలకు 2—3 ఏళ్ల విరామం అవసరం

### ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా అవగాహన ర్యాలీ




**పెన్ పవర్,ప్యాపిలి:** ప్రపంచ జనాభా దినోత్సవాన్నిపురస్కరించుకునివైద్యాధికారుల ఆదేశాల మేరకు శనివారం పట్టణంలో కుటుంబ నియంత్రణపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ అధికారి రాఘవేంద్ర గౌడు మాట్లాడుతూ, దంపతులు ఒక బిడ్డకు మరో బిడ్డకు మధ్య కనీసం 2 నుంచి 3 సంవత్సరాల విరామం పాటించాలని సూచించారు. కుటుంబ నియంత్రణ కోసం కండోమ్‌లు, ఓరల్ పిల్స్, కాపర్-టీ,అంతర ఇంజెక్షన్, ఎమర్జెన్సీ పిల్స్ వంటి తాత్కాలిక గర్భనిరోధక పద్ధతులను వినియోగించడం ద్వారా అనుకోని గర్భధారణను నివారించవచ్చని తెలిపారు. దీంతో తల్లి ఆరోగ్యం మెరుగుపడటంతో పాటు, ప్రసవ సమయంలో వచ్చే సమస్యలు తగ్గుతాయని, మానసిక ఆరోగ్యం మెరుగుపడుతుందని పేర్కొన్నారు. బిడ్డలకు సరైన విరామం ఇవ్వడం వల్ల తక్కువ బరువుతో జననం, నెలలు నిండకముందే ప్రసవం, శిశు మరణాల ప్రమాదం తగ్గుతుందని తెలిపారు. కుటుంబ నియంత్రణను పాటించడం ద్వారా కుటుంబం ఆరోగ్యంగా, ఆనందంగా జీవించవచ్చన్నారు.ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో కుటుంబ నియంత్రణ సేవలు ఉచితంగా అందుబాటులో ఉన్నాయని, ఆశ కార్యకర్తలు, ఏఎన్ఎంలు, ఆరోగ్య సిబ్బంది సూచనలను ప్రజలు పాటించాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఫార్మసిస్ట్ శ్రీనివాసులు, స్టాఫ్ నర్స్ సువర్ణ, ఏఎన్ఎం అరుణబాయి, అబ్దుల్లా, ఆశ కార్యకర్తలు, ఆరోగ్య సిబ్బంది, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## గండికోటకు సాహితీ సమ్మాన్ పురస్కారం



**బుచ్చిరెడ్డిపాలెం పెన్ పవర్ జూలై 11** తెలుగు వైభవం,చరిత్ర,సంస్కృతి, సాహిత్యం,శాసనాల గురించి విద్యార్థులకు, యువతకు బోధిస్తున్న బుచ్చిరెడ్డిపాలెం మున్సిపాలిటీ రామచంద్రాపురం పీఎంశ్రీ పాఠశాల ఉపాధ్యాయులు, సాహితీవేత్త గండికోట సుధీర్ కుమార్ సాహితీ సమ్మాన్ పురస్కారం అందుకున్నారు. విజయవాడలో జరుగుతున్న ప్రపంచ తెలుగు మహాసభలలో శనివారం మహాసభ అధ్యక్ష, కార్యదర్శులు గుత్తికొండ సుబ్బారావు,జి.వి. పూర్ణచందు గండికోటకు అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్త్రీవాద, దళిత సాహిత్యంపై సమాజంలో చైతన్యం తీసుకురావడానికి కవితలు, కథలతో అలుపెరగని పోరాటం చేస్తున్నారన్నారు. శతక పద్య పోటీలు నిర్వహించి బహుమతులు అందజేయడం అభినందనీయమన్నారు. రాజుల కాలం నాటి శాసనాల యొక్కచరిత్ర, విశిష్టత, ప్రాముఖ్యతను విద్యార్థులకు తెలియజేయడం అభినందనీయమని పేర్కొన్నారు. సాహితీ సమ్మాన్ పురస్కారం అందుకున్న గండికోటను సాహితీవేత్తలు మిత్రులు అభినందించారు.

# ప్రజల స్పందన చూసి ఓర్వలేకనే టిడిపి నాయకుల్లో గుబులు

### -మాజీ సెంట్రల్ బ్యాంక్ చైర్మన్ కామిరెడ్డి



**పెళ్లకూరు,పెన్ పవర్, జూలై 11 :** కూటమి మండలటిడిపి నాయకుల్లో గుబులు మొదలైంది. గుడ్ మార్నింగ్ ప్రోగ్రాంకు ప్రజలు చూపిస్తున్న ఆదరణ చూసి ఓర్వలేక పోతున్నారు. రాబోవు ఎన్నికల్లో ఓటమిపాలవుతామనే అప నమ్మకంతో గుడ్ మార్నింగ్ కార్యక్రమానికి అడ్డంకులు, అవరోధాలు సృష్టిస్తున్నారని వైకాపా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మాజీ సెంట్రల్ బ్యాంక్ చైర్మన్ కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి ఖండించారు. శనివారం తను తలపెట్టిన గుడ్ మార్నింగ్ కార్యక్రమాన్ని నిర్వహించేందుకు రావులపాడు గ్రామానికి వెళ్లే ప్రయత్నంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు అడ్డుకోవడంతో ఘర్షణలు దారి తీసే పరిస్థితిని చూసి కార్యక్రమాన్ని ముగించుకుని వెళ్లారు అక్కడ జరిగిన ఆటంకాలు అడ్డగిప్పులపై ఆయన నివాసంలో ఏర్పాటు చేసిన పత్రికా సమావేశంలో మాట్లాడుతూ, శాంతియుతంగా, గుడ్ మార్నింగ్ కార్యక్రమాన్ని జరుపుతుంటే అడ్డగించడం, దాడికి దిగటం ప్రజాస్వామ్య బద్ధమేనా అంటూ ప్రశ్నించారు. గ్రామ సమస్యలతో పాటు, ప్రజల సమస్యలను తెలుసుకునేందుకు వారిని పలకరించేందుకే ఈ కార్యక్రమాన్ని నిర్వహించామని అన్నారు. ప్రతి గ్రామంలో ప్రజలు ఆదరణ, అభిమానం చూపిస్తున్న తీరని చూసి కూటమి నాయకుల్లో భయం ఏర్పడిందని, అందుకోసమే అనేక రకాలుగా అడ్డంకులు కలిగిస్తున్నారని పేర్కొన్నారు. పోలీసులు కూడా ఒక చట్టాన్ని చూపిస్తూ ఎటువంటి ప్రోగ్రాములు ఏర్పాటు చేయకూడదని నిబంధనతో వాట్సాప్ నోటీసులు జారీ చేయడంపై ప్రజాస్వామ్యాన్ని కూని చేస్తున్నారని అన్నారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలైన నిరుద్యోగ భృతి, ఉచిత ఆరు సిలిండర్లు, 50 ఏళ్లకే పెన్షన్, మహిళలకు 15000 వేలు వంటి పథకాలు అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తున్నారని దుయ్యబట్టారు. ఇలాంటి అడ్డంకులు సృష్టించి, కూటమి నాయకులు అడ్డుకోగలరేమో కానీ! ప్రజల్లో వైకాపా పార్టీ పై ఉన్న నమ్మకాన్ని తొలగించలేరు అన్నారు. ఇలాంటి దుశ్చర్యలకు పాల్పడితే ప్రజలు ఏం జరుగుతున్నది గమనిస్తున్నారన్నది గుర్తుపెట్టుకోవాలన్నారు.

# సీనియర్ నాయకులు డాక్టర్ విపి కుమార్ రెడ్డికి నివాళులర్పించిన ఎమ్మెల్యే డా.నెలవల విజయశ్రీ





**నాయుడుపేట, పెన్‌పవర్, జూలై 11 :** సీనియర్ రాజకీయ నాయకులు మాజీ ఎన్డీసీసీబీ డైరెక్టర్ డాక్టర్ వి పి కుమార్ రెడ్డికి సూళ్లూరుపేట ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ, మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం మాజీ మంత్రి డాక్టర్ పరసా రత్నం, బిజెపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సన్నారెడ్డి దయాకర్ రెడ్డి,ఎస్సీ కమిషన్ సభ్యులు డాక్టర్ శ్రీపతి బాబు,పట్టణ టిడిపి అధ్యక్షులు షేక్ రఫీ,నాయుడుపేట ఏఎంసీ చైర్మన్ నివాళులర్పించారు.డాక్టర్ వి పి కుమార్ రెడ్డి గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ శుక్రవారం తిరుపతి సిమ్స్ హాస్పిటల్ లో కన్నుమూసిన విషయం తెలిసిందే.సమాచారం తెలుసుకున్న ఎమ్మెల్యే డాక్టర్ నిలవల విజయశ్రీ మాజీ ఎంపీ నెలల సుబ్రహ్మణ్యం మాజీ మంత్రి డాక్టర్ పరసా రత్నం,ఎస్సీ కమిషన్ సభ్యులు డాక్టర్ శ్రీపతి బాబు,బిజెపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సన్నారెడ్డి దయాకర్ రెడ్డి,పట్టణ టిడిపి ప్రసాదించాలని ఆకాంక్షించారు. అలాగే వారి వెంట ఉన్న బిజెపి పట్టణ అధ్యక్షులు పి రాజశేఖర్ రెడ్డి,తెలుగుదేశం పార్టీ నాయకులు సన్నారెడ్డి చంద్రశేఖర్ రెడ్డి,అవధానం సుధీర్ నానబాల సుబ్బారావు,పోట్లపూడి రాజేష్, నిత్యా కృష్ణారెడ్డి, పలువురు కూటమి పార్టీల నాయకులు కుమార్ రెడ్డి పార్థివ దేహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

# పెన్నా నదిలో జారి ఓ వ్యక్తి మృతి



**సంగం పెన్ పవర్ జూలై 11. :** సంగం మండలం కోలగట్ల గ్రామ సమీపంలోని పెన్నానదిలో ప్రమాదవశాత్తు జారి ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన శనివారం చోటుచేసుకుంది.పోలీసులు తెలిపిన వివరాల మేరకు, ఆత్మకూరు మండలం బొటికర్లపాడు గ్రామానికి చెందిన పి. శేషయ్య (55) గ్రామంలో జరుగుతున్న కొలుపు సందర్భంగా నాగవరపమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించేందుకు గ్రామస్థులతో కలిసి కోలగట్లకు వచ్చారు. పూజలు ముగించుకుని పెన్నానది తీరంలో నుంచి తిరిగి వస్తుండగా ప్రమాదవశాత్తు కాలుజారి నదిలో పడిపోయి గల్లంతయ్యారు.సమాచారం అందుకున్న వెంటనే సంగం ఎస్సై భోజ్యా నాయక్ సిబ్బందితో కలిసి సంఘటనా స్థలానికి చేరుకుని స్థానికుల సహాయంతో గాలింపు చర్యలు చేపట్టారు. అనంతరం శేషయ్య మృతదేహాన్ని నది నుంచి బయటకు తీశారు.ఎస్సై భోజ్యా నాయక్ స్వయంగా తాత్కాలిక స్ట్రెచర్ ఏర్పాటు చేసి మృతదేహాన్ని పెన్నానది నుండి పొలాల్లో ఒకటిన్నర కిలోమీటరు స్థానికుల సహకారంతో మోసుకుని వచ్చి మానవత్వం చాటుకున్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టి.. పోస్టుమార్టం నిమిత్తం తరలించారు.

# తల్లికి వందనం.. సాంకేతిక విఘ్నం

## జిల్లాలో అధికంగా ఖాతాలు తెరవని ఎస్సీ విద్యార్థులు

**చిత్తూరు పెన్ పవర్, జూలై 11 :** ఇంట్లో ఎంతమంది పిల్లలు ఉంటే అంతమందికీ తల్లికి వందనం పథకాన్ని అమలుచేస్తామని కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీకి క్షేత్రస్థాయిలో సాంకేతిక చిక్కులు ఎదురవుతున్నాయి.సాంకేతిక చిక్కుల పేరుతో పథకం లబ్ధిని ఎగ్గొట్టేందుకు కూటమి ప్రభుత్వం కుట్రలకు పాల్పడుతోంది. ఈ పథకానికి ప్రస్తుత ఏడాదిలో సాంకేతిక సాకులతో అధికంగా విద్యార్థులు దూరమయ్యే ప్రమాదం పొంచి ఉంది. రాష్ట్ర అధికారులు విధించిన గడువు సమీపిస్తున్నా జిల్లాలోని ఎస్సీ విద్యార్థుల్లో సగానికి పైగా వారి పేరు మీద ఇంకా బ్యాంక్ ఖాతాలు తెరవకపోవడం ఆందోళన కలిగిస్తోంది. 2026–27 విద్యాసంవత్సరానికి సంబంధించి ఈనెల 15వ తేదీ నుంచి లబ్ధిదారులకు ఒక్కొక్కరికి రూ.15,000 చొప్పున తల్లికి వందనం సొమ్ము జమ చేస్తారని అధికారులు వెల్లడిస్తున్నారు. అయితే విద్యార్థుల పేరు మీద ఖాతాలు లేకపోవడంతో ఆ నిధులు నిలిచిపోయే పరిస్థితి జిల్లాలో ఏర్పడింది.

**గణాంకాల్లో అసలు పరిస్థితి :** జిల్లాలో పదో తరగతి పూర్తిచేసుకుని ఇంటర్‌లో చేరిన మొత్తం ఎస్సీ విద్యార్థులు 12,458 మంది ఉన్నారు. ఇందులో ఇప్పటి వరకు 10 శాతం మంది కూడా ఇప్పటివరకు బ్యాంక్ ఖాతాలు తెరవని దుస్థితి. బ్యాంకు ఖాతాలు తెరిచిన విద్యార్థుల్లో సైతం చాలామంది ఎన్‌పీసీఐతో కూడిన లింక్‌తో ఖాతాలు తెరవలేదని తెలిసింది. ఈ సాంకేతిక సాకుతో వేలాది మంది ఎస్సీ విద్యార్థులకు తల్లికి వందనం పథకం ఎగ్గొట్టేందుకు కూటమి సర్కారు స్కెచ్ వేసింది.

**పోస్టాఫీసుల్లో ఖాతాలు :** ఖాతా సొమ్ము జమ కాకపోతే ఆ ప్రభావం నేరుగా పే ద విద్యార్థుల ఇంటర్ చదువులపై పడుతుందని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎస్సీ విద్యార్థులకు కేంద్ర ప్రభుత్వం నుంచి 40 శాతం, రాష్ట్ర ప్రభు త్వం నుంచి 60 శాతం నిధులు లభిస్తాయి. విద్యార్థుల పేరుతో యాక్టివ్ ఖాతా ఉంటేనే కేంద్రం నుంచి వచ్చే వాటా నేరుగా జమ అవుతుంది. సాధారణ జాతీయ బ్యాంకుల్లో ఖాతా తెరిస్తే ఎన్‌పీసీఐ అనుసంధానానికి కొంత ఆలస్యం అవుతుంది. అదే పోస్టాఫీసులో (ఇండియా పోస్ట్ పేమెంట్స్ బ్యాంక్) ఖాతా తెరిస్తే కేవలం 24 గంటల్లోనే ఎన్‌పీసీఐ అనుసంధానం పూర్తవుతుందని అధికారులు సూచిస్తున్నారు.

**పాన్ కార్డు మినహాయింపు :** పోస్టాఫీసుల్లో ఇప్పటిదాకా కచ్చితంగా పాన్ కార్డు ఉంటేనే ఖాతా తెరవడానికి అవకాశం ఉండేది. కానీ ప్రస్తు త అత్యవసర పరిస్థితి దృష్ట్యా పాన్ కార్డు లేకున్నా.. విద్యార్థి ఆధార్ కార్డు, పదో తరగతి మార్కుల జాబి తా, రూ. 200 ఉంటే చాలు వెంటనే ఖాతా తెరుస్తున్నా రు. ఇంటర్ ప్రథమ సంవత్సరంలోనే ఈ ఖాతా ప్రా రంభిస్తే భవిష్యత్తులో ఎలాంటి ఇబ్బంది ఉండదు

# స్విమ్స్‌లో ‘శ్రీవారి వైద్యసేవ’

**తిరుపతి తుడా పెన్ పవర్, జూలై 11 :** స్విమ్స్ జనరల్ సర్జరీ విభాగంలో టీటీడీ శ్రీవారి వైద్య సేవలో భాగంగా ఈనెల 9వ తేదీ నుంచి మూడు రోజుల పాటు పేషంట్లకు ఉచిత చికిత్సను అందించినట్లు ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ రామ్ తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ వైజాగ్ ఈఎస్ఐ హాస్పిటల్ జనరల్ సర్జరీ విభాగంలో పనిచేస్తున్న డాక్టర్ శేషగిరి రావు శ్రీవారి వైద్యసేవలో భాగంగా స్విమ్స్‌లో వైద్య సేవలు అందించడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ శేషగిరిరావును ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో శ్రీవారి వైద్యసేవ ప్రోగ్రామ్ కో–ఆర్డినేటర్ డాక్టర్ సతీష్, జనరల్ సర్జరీ విభాగాధిపతి ముక్తేశ్వర రావు పాల్గొన్నారు.

# ప్రకృతి వ్యవసాయమే శ్రేయస్కరం

**తిరుపతి సిటీ పెన్ పవర్, జూలై 11 :** ప్రకృతితో మమేకమైన వ్యవసాయమే భావి భారతానికి శ్రేయస్కరమని ప్రకృతివనం వ్యవస్థాపకుడు ఎంసీవీ ప్రసాద్ తెలిపారు. శనివారం జాతీయ సంస్కృత వర్సిటీ వేదికగా భారతీయ జ్ఞాన పరంపరలో వ్యవసాయం అనే అంశంపై చర్చా కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఎంసీవీ ప్రసాద్ మాట్లాడతూ భారతీయ ఆహారం, సహజ వ్యవసాయం, జీవన విధానం, ప్రాచీన గ్రంథాలలో పేర్కొన్న వ్యవసాయ సూత్రాలకు ప్రత్యేక ప్రాధాన్యత ఉందని వెల్లడించారు. ప్రతి ఒక్కరూ వాటిని పాటించాలని కోరారు. సంపూర్ణ ఆరోగ్య రక్షణకు ప్రకృతి వ్యవసాయాన్ని కొనసాగించాలని సూచించారు. ఆఫ్రికా దేశాల్లో అమలవుతున్న సహజ వ్యవసాయ విధానాలను ఉదాహరణగా తీసుకోవచ్చని తెలిపారు. ప్రాచీన భారతీయ వ్యవసాయ జ్ఞానం ప్రకృతి ఆధారితమైందని, నేటి సమాజానికి అది ఎంతో ఉపయుక్తమని వెల్లడించారు. అనంతరం సదస్సులో పలువురు పండితులు తమ పరిశోధన పత్రాలను సమర్పించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ కేవీ నారాయణరావు, డీన్ ప్రొఫెసర్ రజనీకాంత్ శుక్లా, అధ్యాపకులు నిరంజన్ మిశ్రా, గిరిజాప్రసాద్ షడంగివ, సుబ్రమణ్య బిడే, బాలభద్ర ఉపాధ్యాయ, శ్రీపాద భట్, డాక్టర్ శివరామ్‌భట్ పాల్గొన్నారు.

# శ్రీవారి దర్శనానికి 30 గంటలు

**తిరుమల పెన్ పవర్, జూలై 11 :** తిరుమలలో శనివారం భక్తుల రద్దీ ఎక్కువగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లోని 31 కంపార్ట్‌మెంట్లు భక్తులతో నిండిపోయాయి. క్యూలైన్ పాచికాలవ గంగమ్మ గుడి వద్దకు చేరుకుంది. శుక్రవారం అర్ధరాత్రి వరకు 73,265 మంది స్వామివారిని దర్శించుకున్నారు. 39,690 మంది భక్తులు తలనీలాలు అర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.4.26 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలో దర్శనం లభిస్తోంది. దర్శన టిక్కెట్లు లేని వారు స్వామిని దర్శించుకోవడానికి 30 గంటల సమయం పడుతోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లు కలిగిన వారు 3 గంటల్లో స్వామిని దర్శించుకోగలుగుతున్నారు. ఇదిలా ఉంటే సర్వదర్శనం టోకెన్లు కలిగిన భక్తులు నిర్దేశించిన సమయానికి మాత్రమే క్యూలోకి వెళ్లాలని టీటీడీ విజ్ఞప్తి చేస్తోంది. కేటాయించిన సమయానికంటే ముందు వెళ్లిన వారిని క్యూలోకి అనుమతించరని స్పష్టంచేసింది.

# తుది జాబితా ప్రకటన

**చిత్తూరు కలెక్టరేట్ పెన్ పవర్, జూలై 11** ఉమ్మడి చిత్తూరు జిల్లా పరిధిలోని ప్రభుత్వ, జిల్లా పరిషత్, మున్సిపల్, మున్సిపల్ కార్పొరేషన్ పాఠశాలల ఉపాధ్యాయుల టీఐఎస్ తుది జాబితా ప్రచురించామని ఇన్‌చార్జి డీఈఓ వెంకటేశ్వరరావు తెలిపారు. ప్రధానోపాధ్యాయులు, స్కూల్ అసిస్టెంట్లు ,సెకండరీ గ్రేడ్ టీచర్లు, వారి ప్రొవిజనల్ జనరల్ సీనియారిటీ జాబితాలు టీఐఎస్‌లో నమోదైన సేవా వివరాల ఆధారంగా వివరాలు ప్రకటించామన్నారు. ఇప్పటివరకు నాలుగు దఫాలుగా వీటిని ప్రచురించి, అభ్యంతరాలు సవరించి తుది సీనియారిటీ జాబితాను ప్రస్తుతం ప్రకటించామన్నారు. ఆవివరాలను ఉప విద్యాశాఖాధికారులు, మండల విద్యాశాఖాధికారుల అధికారిక ఈ–మెయిల్‌కు పంపించారన్నారు. వాటిని పరిశీలించుకోవాల్సిందిగా వివరించారు.

# రేపటి ‘గ్రీవెన్స్’ రద్దు

**తిరుపతి అర్బన్ పెన్ పవర్, జూలై 11** జిల్లావ్యాప్తంగా కలెక్టరేట్‌తోపాటు మండల, డివిజన్ కార్యాలయాల్లో సోమవారం నిర్వహించాల్సిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (గ్రీవెన్స్)ను రద్దు చేసినట్లు కలెక్టర్ వెంకటేశ్వర్ తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (సర్) నేపథ్యంలో అధికారులకు వివిధ బాధ్యతలు అప్పగించిన క్రమంలోనే గ్రీవెన్స్‌ను రద్దు చేశామని వివరించారు. ఈ విషయాన్ని ప్రజలు గుర్తించాలని కోరారు.

# నిలకడ లేని ధరలు

## కేజీ రూ.15 మాత్రమే..! ఆందోళనలో రైతులు

**సైదాపురం పెన్ పవర్, జూలై 11 :** జిల్లావ్యాప్తంగా సుమారు 10వేల ఎకరాల్లో రైతులు నిమ్మసాగు చేస్తున్నారు. ఈ పంటకు ప్రత్యేకంగా సీజన్ అంటూ ఉండకపోవడంతో ఏడాది పొడవునా దిగుబడి వస్తూనే ఉంటుంది. అయితే ప్రస్తుతం ధరలు నిలకడ లేకపోవడంతో రైతులకు ఇబ్బందులు తప్పడం లేదు. గత రెండు నెలల్లో ఓ మోస్తరు వర్షాలు వచ్చినప్పటికీ ధరలు ఆశాజనకంగానే ఉన్నాయి. ఈ నెలలో మాత్రం నిమ్మ కాయల రేటు ఒక్కసారిగా పడిపోవడంతో రైతులు దిక్కుతోచక కొట్టుమిట్టాడుతున్నారు.

**నాణ్యత లేక రిటర్న్ :** నిమ్మ కాయలను నిత్యం వివిధ రాష్ట్రాలకు ఎగుమతి చేస్తుంటారు. అయితే ఇటీవల కురిసిన అరకొర జల్లుల కారణంగా కాయల నాణ్యత లోపించింది. దీంతో పలు రాష్ట్రాలకు తీసుకెళ్లిన నిమ్మకాయలను అక్కడి మార్కెట్లలోని వ్యాపారులు వెనక్కి తిప్పి పంపేస్తున్నారు. ఈ పరిస్థితి రైతులను మరింత ఇబ్బందుల్లోకి నెట్టేస్తోంది.

**ఏం చేయాలో తెలియడం లేదు :** పది ఎకరాల్లో నిమ్మ సాగు చేస్తున్నా. మార్కెట్‌లో ధరలు లేకుండా పోయా యి. అటు గూడూరు, ఇటు నెల్లూరు జిల్లాలోని పొదలకూరు మార్కెట్‌కు కాయలు కోసి లోడ్ తీసుకెళితే ధరలు అంతంత మాత్రంగానే ఉంటున్నాయి. కనీసం పెట్టుబడులు కూడా రాకపోవడంతో అప్పులు చేయాల్సిన దుస్థితి దాపురించింది. ఏం చేయాలో తెలియడం లేదు.

**తగ్గిన ధర :** నిమ్మకాయలు విపరీతంగా కాపునకు వస్తే మాత్రం ఆ ఏడాది మాత్రం మార్కెట్‌లో ఆశించిన ధరలు లభించవు, దిగుబడి లేని సమయాల్లో మాత్రం ధరలు పెరుగుతుంటాయి. ప్రస్తుతం కేజీ రూ.15 మాత్రమే పలుకుతుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. గత ఏడాది ఇదే సీజన్‌లో కేజీ రూ.90 నుంచి రూ.110 వరకు పలికింది. ఇప్పుడు రూ.14 నుంచి రూ.15కి పడిపోయింది.. దీంతో ఖర్చులు కూడా రావని రైతులు కాయలను అలాగే తోటల్లోనే వదలేస్తున్నారు.

# రాయితీ విత్తనానికి ఎల్‌నినో ఎఫెక్ట్..!

వేరుశనగ విత్తనాలపై ముందుగానే చేతులెత్తేసిన వ్యవసాయశాఖ
అన్నదాతకు తప్పని అగచాట్లు
జూలై 11 దాటినా అంతులేని ఎదురుచూపులు
సాధారణ విస్తీర్ణం 21,903 హెక్టార్లు
సాగైంది మాత్రం కేవలం 93 హెక్టార్లే
విత్తనాలపై స్పష్టత ఇవ్వాలని రైతుల డిమాండ్

**చిత్తూరు రూరల్(కాణిపాకం) పెన్ పవర్, జూలై 11:** జిల్లాలో రాయితీ వేరుశనగ విత్తనాల పంపిణీపై ఎల్‌నినో నీలినీడలు కమ్ముకున్నాయి. ఈసారి ఎల్‌నినో ప్రభావం గట్టిగా ఉంటుందని, వర్షాలు పడవని, కాబట్టి వేరుశనగ విత్తన కాయలు ఇవ్వడం అనుమానమేనంటూ గతంలో వ్యవసాయ అధికారులు చెప్పిన ముందస్తు హెచ్చరికలు ఇప్పుడు అక్షరాలా నిజమవుతున్నాయి. అధికారులు చెప్పిన ఆ చేదు నిజం ఇప్పుడు రైతుల పాలిట శాపంగా మారింది. సీజన్ ముదురుతున్నా జిల్లాకు ఆశించిన స్థాయిలో వేరుశనగ కాయలు రాని పరిస్థితి నెలకొంది. వ్యవసాయశాఖ ముందస్తు ప్రణాళికలు వేయడంలో పూర్తిగా విఫలం కావడంతో అన్నదాతలు దిక్కుతోచని స్థితిలో పడిపోయారు.

**కాయలు కాసేలా.. ఎదురుచూపులు :** ప్రతి ఏటా మే చివరి వారం లేదా జూన్ మొదటి వారంలోనే వేరుశనగ రాయితీ విత్తనాలను పంపిణీ చేసేవారు. కానీ, ఈసారి జూలై 11వ తేదీ దాటిపోతున్నా విత్తన కాయల ఊసే లేదు. జిల్లాకు 27వేల క్వింటాళ్ల కాయలు కేటాయిస్తే...కుప్పం, పలమనేరు నియోజకవర్గాలకు కలిపి కేవలం 6 వేల క్వింటాళ్ల కాయలు మాత్రమే వచ్చాయని అధికారులు నోటిమాటగా చెబుతున్నా, క్షేత్రస్థాయిలో ఆ పరిస్థితి కనిపించడం లేదు. ఇక మిగిలిన నియోజకవర్గాల రైతులకు మాత్రం మొండిచేయి మిగిలింది. పల్లెల్లో రైతులు విత్తన కాయల కోసం కళ్లు కాయలు కాసేలా ఎదురుచూస్తున్నారు. సాగు కోసం చాలా మంది రైతులు అప్పులు తెచ్చి మరీ దుక్కులు దున్ని సిద్ధం చేసుకున్నా.. అధికారులు మాత్రం అదిగో వస్తున్నాయి.. ఇదిగో వస్తున్నాయి అంటూ కాలయాపన చేస్తూ బూచి చూపిస్తున్నారు. విత్తనాలు రావని ముందే గ్రహించిన కొందరు రైతులు.. తప్పనిసరి పరిస్థితుల్లో తాము నిల్వ ఉంచుకున్న కాయలను లేదా ప్రైవేటు వ్యాపారులను ఆశ్రయించి అధిక ధరలకు కొనుగోలు చేసి విత్తుకున్నారు. మరికొందరు విత్తనాలు లేక దుక్కి దున్నిన పొలాలను అలాగే వదిలేశారు.

**సాగు కుదేలు :** జిల్లాలో వేరుశనగ సాధారణ సాగు విస్తీర్ణం 21,903 హెక్టార్లు కాగా, విత్తనాల కొరత, వర్షాభావం కారణంగా ఈసారి ఇప్పటివరకు కేవలం 93 హెక్టార్లలో మాత్రమే సాగు నమోదు కావడం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది. ఇంత జరుగుతున్నా వ్యవసాయశాఖ అధికారులు మాత్రం.. ఎల్‌నినో ఎఫెక్ట్ ఉందంటూ, వర్షాలు పడవు కాబట్టి ప్రత్యామ్నాయ పంటలు వేసుకోవాలంటూ ఉచిత సలహాలు ఇస్తూ బాధ్యత నుంచి తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నారు. రాయితీ విత్తనాలు ఇస్తారా? లేదా? అనే విషయాన్ని అధికారులు స్పష్టంగా చెబితే, తాము ఇతర పంటలైనా వేసుకుంటామని, కాలం దాటిపోతే దేనికీ పనికిరాకుండా పోతామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా వ్యవసాయశాఖ ఉన్నతాధికారులు నోరు విప్పి, రాయితీ విత్తనాల పంపిణీపై స్పష్టత ఇవ్వాలని, అన్నదాతలను ఆదుకోవాలని జిల్లా రైతాంగం డిమాండ్ చేస్తోంది.

## మామిడి అన్‌లోడింగ్‌కు నాలుగు రోజులు

**గుడిపాల పెన్ పవర్, జూలై 11 :** మామిడికాయల అన్‌లోడింగ్‌కు నాలుగు రోజులు పడుతోంది. గొల్లమడుగు వద్ద ఉన్న ఫుడ్ అండ్ ఇన్స్ జ్యూస్ ఫ్యాక్టరీ వద్ద మూడు ప్లాంట్లు ఉన్నాయి. ఇందులో ఒక ప్లాంట్‌లో యంత్రాలు మరమ్మతులకు గురికావడంతో యాజమాన్యం నిలిపివేసింది. దీంతో రెండు ప్లాంట్లు మాత్రం నడుస్తున్నాయి. ర్యాంపులన్నీ మామిడికాయలతో నిండిపోయాయి. ఫ్యాక్టరీ వద్ద ట్రాక్టర్లు బారులు తీరాయి. కాయల అన్‌లోడింగ్‌కు నాలుగురోజులు పడుతోందని ట్రాక్టర్ డ్రైవర్లు తెలిపారు.

## పోక్సో కేసు నమోదు

**పలమనేరు పెన్ పవర్, జూలై 11 :** మండలంలోని టి. వడ్డూరు గ్రామా నికి చెందిన మైనర్ బాలిక అదృశ్యం కేసులో మున్సిపాలిటీ పరిధిలోని గొబ్బిళ్లకోటూరుకు చెందిన భుజేంద్ర అనే యువకునిపై పోక్సో కేసు నమోదు చేసినట్టు సీఐ మోహన్‌రెడ్డి శనివారం తెలిపారు. మైనర్ బాలికకు మాయమాటలు చెప్పి తనతోపాటు తీసుకెళ్లినట్టు తెలిసిందని దీంతో కేసు నమోదుచేసి నిందితుని కోసం గాలిస్తున్నట్టు పేర్కొన్నారు.

## డిజిటలైజేషన్ 100 శాతం పూర్తి చేయాలి

**గంగాధరనెల్లూరు పెన్ పవర్, జూలై 11:** ఎస్ఐఆర్ కార్యక్రమంలో భాగంగా ఓటర్ల నుంచి ఎన్యూమరేషన్ ఫారాల ను తిరిగి స్వీకరించి డిజిటలైజేషన్ కార్యక్రమాన్ని వంద శాతం పూర్తి చేయాలని డీఆర్‌ఓ మోహన్ కుమార్ ఆదేశించారు. ఆయన శనివారం గంగాధర నెల్లూరు తహసీల్దార్ కార్యాలయంలో ఎస్ఐఆర్‌పై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఓటర్ల నుంచి బీఎల్వోలు స్వీకరించి న ఎన్యూమరేషన్ ఫారాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయ న మాట్లాడుతూ వీలైనంత త్వరగా ఎన్యూమరేషన్ ఫారాలను తిరిగి తీసుకుని డిజిటలైజేషన్ చేయాలని సూచించారు. మండలంలో ఇప్పటివరకు 84 శాతం పూర్తయిందని, మిగిలినవి కూడా పూర్తి చేయాలని ఆదేశించారు. ఈఆర్వో మధుసూదన్, తహసీల్దార్ సీకే శ్రీనివాసులు, ఎలక్షన్ డీటీ మోహన్,బీఎల్వోలు పాల్గొన్నారు.

## పకడ్బందీగా ఉపాధి పనులు

**తిరుపతి అర్బన్ పెన్ పవర్, జూలై 11 :** క్షేత్రస్థాయిలో పకడ్బందీగా ఉపాధి పనులు నిర్వహించాలని కేంద్ర గ్రామీణాభివృద్ధి మంత్రిత్వశాఖ డిప్యూటీ డైరెక్టర్ ఇషాసింగ్ స్పష్టం చేశారు. శనివారం తిరుపతిలోని డ్వామా కార్యాలయంలో ఉపాధి పనులపై అధికారులతో సమీక్షించారు. ఆమె మాట్లాడుతూ ఈ నెల 1వ తేదీ నుంచి వీబీ జీ – రామ్ జీ పేరుతో ఉపాధి పథకం అమలు చేస్తున్నట్లు వెల్లడించారు. ప్రధానంగా ఒక కుటుంబానికి ఉపాధి కల్పించే పనిదినాలు 100 నుంచి 125 ఉండాలని ఆదేశించారు. వ్యవసాయ సీజన్‌లో రైతులకు కూలీల కొరత రాకుండా 60 రోజులపాటు ఉపాధి పనులకు విరామం ఉంటుందని తెలిపారు.రోజువారీ కూలిని రూ.307 నుంచి రూ.312కి పెంచాలని సూచించారు. పీడీ మద్దిలేటి మాట్లాడుతూ ఈ నెలలో జిల్లావ్యాప్తంగా ఇప్పటి వరకు 986 పనులు చేపట్టినట్లు తెలిపారు.

## జల్సాల కోసం దొంగల అవతారం

**అనంతపురం సెంట్రల్:** చెడు వ్యసనాలకు బానిసైన ఇద్దరు మిత్రులు జల్సాలను తీర్చుకోవడానికి దొంగల అవతారమెత్తారు. జిల్లాలోనే కాకుండా తెలంగాణలో సైతం తస్కరించిన ద్విచక్రవాహనాలను ఒక చోట భద్రపరిచి బెంగుళూరులో విక్రయించేందుకు యత్నిస్తూ పోలీసులకు పట్టుబడ్డారు. నిందితుల వివరాలను శనివారం టూటౌన్ పోలీసుస్టేషన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో అదనపు ఎస్పీ మహబూబ్‌బాషా వెల్లడించారు. రూరల్ మండల పరిధిలోని నందమూరి నగర్‌కు చెందిన బందారు మురళీకృష్ణ, ఆర్‌కే నగర్‌కు చెందిన వన్నూరు షేక్ అలీ అక్బర్‌లు స్నేహితులు. తాగుడుకు బానిసైన వీరు డబ్బు కోసం ఇళ్లు, హాస్పిటళ్ల తదితర చోట్ల పార్కింగ్ చేసిన ద్విచక్ర వాహనాలను తస్కరించేవారు. కొన్ని నెలలుగా నగరంలో ద్విచక్రవాహనాల దొంగతనాలు ఎక్కువ కావడంతో పోలీసులు ప్రత్యేక దృష్టి సారించారు. శనివారం ప్రసన్నాయపల్లి రైల్వే గేటు సమీపంలో టూటౌన్ సీఐ పుల్లయ్య, ఎస్ఐలు రుషేంద్రబాబు, రామకృష్ణ ఆధ్వర్యంలో సిబ్బంది తనిఖీలు చేస్తుండగా ఒక ద్విచక్రవాహనంలో నిందితులు అనుమానాస్పదంగా వచ్చారు. వారిని పట్టుకొని విచారించగా, అసలు విషయం వెల్లడైంది. అనంతపురం, తాడిపత్రి, పెనుకొండ, కదిరి, గుంతకల్లు పట్టణాలతో పాటు తెలంగాణలోనూ ద్విచక్రవాహనాలు దొంగలించి నగరంలో వివిధ చోట్ల భద్రపరిచినట్లు పేర్కొన్నారు. మొత్తం రూ.19 లక్షల విలువజేసే 25 ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు అదనపు ఎస్పీ మహబూబ్‌బాషా వివరించారు.

## రాజీతో కేసుల పరిష్కారం సులభం

**–లోక్ అదాలత్‌లో 12,829 కేసులు పరిష్కారం**

**చిత్తూరు అర్బన్ పెన్ పవర్, జూలై 11 :** దీర్ఘకాలికంగా న్యాయస్థానాల్లో పెండింగ్‌లో ఉన్న కేసులను పరిష్కరించడానికి రాజీ మార్గమమే మంచిదని, జిల్లా ప్రధాన న్యాయమూర్తి అరుణసారిక అన్నారు. శనివారం చిత్తూరు న్యాయస్థానాల సముదాయంలో జాతీ య లోక్‌అదాలత్ నిర్వహించారు. జిల్లా జడ్జి మా ట్లాడుతూ అదాలత్‌లో పరిష్కరించుకున్న కేసుల పై అప్పీలుకు వెళ్లడానికి కూడా వీలుండదన్నారు. అనంతరం కేసులు పరిష్కరించుకున్న పలువురికి అవార్డు పత్రాలను అందచేశారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి భారతి, పలువురు న్యాయమూర్తులు, న్యాయవాదులు పాల్గొన్నారు.

**12,829 కేసులు :** కాగా పూర్వపు చిత్తూరు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా నిర్వహించిన లోక్‌అదాలత్‌లో 12,829 కేసులు పరిష్కరించారు. వీటిలో 167 సివిల్, 12,565 క్రిమినల్, 97 ప్రీలిటిగేషన్ కేసులు ఉన్నాయి.

## వైఎస్సార్‌సీపీ కార్యకర్త మృతి

**పుల్లంపేట పెన్ పవర్, జూలై 11:** రోడ్డు ప్రమాదంలో వైఎస్సార్‌సీపీ కార్యకర్త సయ్యద్ అన్వర్ (82) మృతి చెందాడు. వివరాలు.. అప్పయ్యరాజుపేటకు చెందిన సయ్యద్ అన్వర్ శనివారం రాత్రి రోడ్డు దాటుతుండగా గుర్తు తెలియని కారు ఢీకొంది. క్షతగాత్రుడిని 108లో రాజంపేట ప్రభుత్వాస్పత్రికి తరలించగా చికిత్సపొందుతూ మరణించాడు. అన్వర్ మృతికి పార్టీ మండల కన్వీనర్ సయ్యద్ ముస్తాక్ సంతాపం తెలిపారు.

## 4,640 కేసుల పరిష్కారం

**తిరుపతి లీగల్ పెన్ పవర్, జూలై 11 :** తిరుపతి కోర్టు ఆవరణలో శనివారం నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో 4,640 కేసులు పరిష్కరించినట్లు తిరుపతి మూడవ అదనపు జిల్లా జడ్జి ఎం. గురునాథ్ తెలిపారు. కేసుల పరిష్కారం కోసం 5 బెంచులను ఏర్పాటు చేసినట్టు వెల్లడించారు. తనతోపాటు బెంచ్‌లకు అధ్యక్షులుగా తిరుపతి పదవ అదనపు జిల్లా జడ్జి కృష్ణన్ కుట్టి, ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి వెన్నెల, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి లెనిన్ బాబు, మొదటి అదనపు జూనియర్ సివిల్ జడ్జి రమాదేవి వ్యవహరించినట్టు వివరించారు.

## భక్తిశ్రద్ధలతో గంధం ఉత్సవం

**గుంతకల్లు పెన్ పవర్, జూలై 11 :** పాత గుంతకల్లులోని హజరత్ మస్తాన్‌వలి ఉరుసు ఉత్సవాల్లో భాగంగా శనివారం గంధం ఉత్సవం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. శుక్రవారం అర్ధరాత్రి నుంచి శనివారం ఉదయం వరకు దర్గా ధర్మకర్తలు, వక్ఫ్‌బోర్డు అధికారులు, ముజావర్ల నేతృత్వంలో గంధం ఉత్సవం వైభవంగా జరిగింది. అందంగా అలంకరించిన గంధం పళ్లెన్ని గుర్రంపై ఉంచి మేళతాళాల నడుమ దర్గా నుంచి ఊరుయకాల సమీపంలోని గణాచారి రెడ్డి కులస్తుల ఇంటికి చేర్చారు. సాజెదినాసేన్ (పూజారులు) ప్రత్యేక ప్రార్థనల అనంతరం అక్కడి నుంచి ఊరేగింపుగా దర్గాకు తీసుకొచ్చారు. మస్తానయ్య ప్రార్థనా మందిరం చుట్టూ ప్రదక్షిణ చేశారు.

## ‘నవోదయ’ ప్రవేశంపై నేడు అవగాహన

**తిరుపతి అర్బన్ పెన్ పవర్, జూలై 11 :** తిరుపతి వరదరాజనగర్‌లోని విశ్వం విద్యాసంస్థల ఆవరణలో జవహర్ నవోదయ విద్యాలయ ప్రవేశ పరీక్షకు సంబంధించి ఆదివారం ఉచిత అవగాహన సదస్సు నిర్వహించన్నట్లు కోచింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎన్. విశ్వనాథరెడ్డి శనివారం తెలిపారు. 2027 నవోదయ ప్రవేశ పరీక్షల్లో కీలకమార్పులు చేశారని వెల్లడించారు. ఇప్పటి వరకు నిర్వహిస్తున్న మెంటల్ ఎబిలిటీ టెస్ట్, అర్థమెటిక్ టెస్ట్, భాషా పరీక్షలతోపాటు పర్యావరణ అధ్యాయనం అనే అంశాన్ని పరీక్షల్లో చేర్చినట్లు వివరించారు. కొత్త పరీక్షా విధానం, సిలబస్, ప్రశ్నపత్రం నమూనా, మార్కుల విభజన, సబ్జెక్టుల వారీగా ప్రిపరేషన్, ఆన్‌లైన్ దరఖాస్తు విధానం తదితర అంశాలపై నిపుణులచే సమగ్రంగా అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. నవోదయ ప్రవేశ పరీక్షకు దరఖాస్తు చేసుకోవడానికి ఈ నెల 31 వరకు మాత్రమే గడువు ఉందని వెల్లడించారు. అవగాహన సదస్సుకు ఎలాంటి రుసుం లేదని స్పష్టం చేశారు. వివరాలకు 8688888802, 8688888803, 9399976999 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

## ఎర్రచందనం పట్టివేత

**భాకరాపేట పెన్ పవర్, జూలై 11 :** చిన్నగొట్టిగల్లు మండలం భాకరాపేట అటవీ ప్రాంతంలో ఫారెస్ట్ అధికారులు తనిఖీలు చేపట్టారు. శనివారం ఈ మేరకు కారులో తరలిస్తున్న రూ.16లక్షల విలువైన 11 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నారు. అయితే ఇద్దరు స్మగ్లర్లు కారును వదిలేసి పరారైనట్లు అటవీశాఖ అధికారులు వెల్లడించారు. డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ ఆర్ఎస్ చైతన్య, ఎఫ్‌బీఓలు సి.రవి, జేబీ నిఖిల్ పాల్గొన్నారు.

## ట్రాక్టర్లు..జేసీబీల సీజ్

**సూళ్లూరుపేట రూరల్ పెన్ పవర్, జూలై 11 :** మండలంలోని మన్నేముత్తేరి చెరువులో అక్రమంగా మట్టి తరలిస్తున్న ఐదు ట్రాక్టర్లు, జేసీబీలను పోలీసులు శనివారం స్వాధీనం చేసుకున్నారు. మన్నేముత్తేరిలోని తామర మడుగు గుంట నుంచి అక్రమంగా మట్టి తరలింపుపై సీఐ మురళీకృష్ణ సిబ్బందితో కలిసి దాడి చేశారు. అక్రమంగా మట్టి తవ్వితే ఉపేక్షించే ప్రసక్తే లేదని, కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

# ఇంజినీరింగ్ విద్యార్థులకు బంగారు భవిత

## ఎస్ఆర్ఐటీ కరస్పాండెంట్ ఆలూరి సాంబశివారెడ్డి

**బుక్కరాయసముద్రం పెన్ పవర్, జూలై 11** ఇంజినీరింగ్ విద్యార్థులకు బంగారు భవిష్యత్తు ఉంటుందని ఎస్ఆర్ఐటీ (అటానమస్) ఇంజినీరింగ్ కళాశాల కరస్పాండెంట్ ఆలూరి సాంబశివారెడ్డి పేర్కొన్నారు. శనివారం మండల పరిధిలోని రోటరీపురంలో ఉన్న కళాశాలలో 4వ స్నాతకోత్సవం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి కళాశాల చైర్మన్ జొన్నలగడ్డ పద్మావతి, కరస్పాండెంట్ ఆలూరి సాంబశివారెడ్డి అధ్యక్షత వహించగా, ముఖ్య అతిథులుగా కాగ్నిజెంట్ సంస్థ సీనియర్ హెచ్ఆర్ మేనేజర్ జితేంద్రసింగ్, ఎల్టీఎం సంస్థ సీనియర్ మేనేజర్ కిరణ్కుమార్, మాచర్ల జేఎన్టీయూ నామినీ ప్రొఫెసర్ జయలక్ష్మి, అనంతపురం జేఎన్టీయూ డైరెక్టర్ (అకాడమీ ప్లానింగ్) ప్రొఫెసర్ సత్య నారాయణ, డైరెక్టర్ (ఫ్యాకల్టీ అఫైర్స్ అండ్ అడ్మిషన్స్) ప్రొఫెసర్ సురేష్బాబు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆలూరి సాంబశివారెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు ఇంజినీరింగ్ చదవడానికి ఒక మంచి కళాశాలను ఎంచుకోవాల్సి ఉంటుందన్నారు. క్రమశిక్షణ, పట్టుదలతో చదివితే ఎక్కడైనా రాణించవచ్చన్నారు. తమ కళాశాలలో నాణ్యమైన విద్య అందించడమే కాకుండా విద్యార్థులకు బంగారు భవిష్యత్తు కల్పించడమే లక్ష్యంగా పనిచేస్తున్నామన్నారు.

**బంగారు పతకాలు సాధించిన విద్యార్థులు :** పాగాకు పూజితవల్లి (సీఎస్ఈ–ఏఐఎంఎల్) అనే విద్యార్థి సంస్థ అత్యున్నత ఇన్స్టిట్యూషన్ గోల్డ్మెడల్తో పాటు ఆలూరి నారాయణమ్మ మెమోరియల్ అవార్డు అందుకుంది. వడ్డే శరత్ (సీఎస్ఈ) ఆలూరి సుంకిరెడ్డికి మెమోరియల్ అవార్డు ప్రదానం చేశారు. గొల్లపిన్ని ప్రణవి (సీఎస్ఈ), రాముల జోష్ణ (సీఎస్డీ), చేరెడ్డి జాహ్నవి (ఈసీసీ), వడ్డే అభినయ్ (ఈఈఈ), చెరకుపల్లి సాయి (సివిల్), బత్తల సంతోష్ (మెకానికల్)లు బంగారు పతకాలు అందుకున్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బాలక్రిష్ణ, వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ రంజిత్రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాస్, డైరెక్టర్ ఆఫ్ అడ్మిషన్స్ వెంకట ధనుంజయరెడ్డి, వివిధ విభాగాల అధిపతులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# వైఎస్సార్ జిల్లాలో కరోనా కలవరం

**సమస్యగా మారిన కరోనా నిర్ధారణ**

**పీహెచ్సీల్లో ఎక్కడా నిర్ధారణ పరికరాల్లేవు**

**8 మందికి కరోనా . మరణించినా ఇద్దరు**



**కడప రూరల్ పెన్ పవర్, జూలై 11:** వైఎస్సార్ కడప జిల్లాలో కరోనా ప్రకంపనలు పుట్టిస్తోంది. శుక్రవారం సాయంత్రం వరకు జిల్లా వ్యాప్తంగా 8 కరోనా కేసులు నమోదవగా.. వారిలో ఇద్దరు మృతిచెందారు. శనివారం ఎలాంటి కేసులు నమోదు కాలేదని వైద్యాధికారులు తెలిపారు. అయితే కరోనా కేసుల విషయంలో గోప్యత పాటిస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇంత జరుగుతున్నా వైద్యాధికారులు.. ప్రభుత్వ యంత్రాంగం పట్టించుకోకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఎక్కడ కరోనా నిర్ధారణకు పరీక్షలకు సంబంధించిన పరికరాల్లేవు. గల్ల పరీక్షలు మాత్రమే చేస్తున్నారు. అందులో 5–10 శాతం మాత్రమే కోవిడ్ అనుమాన లక్షణాలు బయటపడే అవకాశం ఉంది. వ్యాధి నిర్ధారణ జరిగే సమయానికి మరి కొంతమందికి కోవిడ్ సోకే ప్రమాదం పొంచి ఉంది. ఈ నిర్ధారణ పరీక్షలు ప్రస్తుతానికి కేవలం కడప ప్రభుత్వ సర్వజనాస్పత్రిలోనే జరుగుతున్నాయి. అక్కడ కూడా పాజిటివ్ వస్తే.. వ్యాధి తీవ్రత(గ్రేడ్ )ను కనుగొనేందుకు పూణెలోని ల్యాబ్కు పంపాల్సి వస్తోంది. ఇదిలా ఉండగా, కడప రిమ్స్లోని ఐసోలేషన్లో కరోనా పాజిటివ్ బాధితులు చికిత్స పొందుతున్నట్టు వైద్యాధికారులు చెప్పారు.

# అప్పుల బాధతో మహిళా రైతు ఆత్మహత్యాయత్నం

**మదనపల్లె పెన్ పవర్, జూలై 11 :** వ్యవసాయానికి చేసిన అప్పులు తీర్చలేక ఓ మహిళ రైతు మనస్తాపంతో జీవితంపై విరక్తి చెంది నిద్ర మాత్రలు మింగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. శనివారం కురబలకోట మండలంలో వెలుగు చూసిన ఘటనపై బాధితురాలి కుటుంబీకులు తెలిపిన వివరాలు.. మండలంలోని అంగళ్లు పంచాయతీ పెద్ద కటపకు చెందిన శంకర భార్య లక్ష్మి(50) ఊరికి సమీపంలో కౌలుకు భూములు సాగు చేసి సుమారు 10 లక్షలకు పైగా అప్పులు చేసి పంటలను పండించింది. అయితే పంటలకు గిట్టుబాటు ధరలు లేక అప్పులు తీర్చలేక పోయింది. దీంతో రుణ దాతల ఒత్తిళ్లు అధికం కావడంతో అప్పు తీర్చే మార్గం లేక ఇంట్లో ఉన్న నిద్ర మాత్రల మింగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. కుటుంబీకులు గమనించి బాధితురాలిని వెంటనే మదనపల్లి జిల్లా ప్రభుత్వాసుపత్రిక తరలించిగా డాక్టర్లు వైద్యం అందించారు. ఘటనపై ముదివేడు పోలీసులు కేసు విచారణ చేస్తున్నారు.

# సంబరంగా స్నాతకోత్సవం

**కర్నూలు పెన్ పవర్, జూలై 11 :** ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ డిజైన్ అండ్ మ్యానుఫ్యాక్చరింగ్(ట్రిపుల్ఐటీడీఎం) స్నాతకోత్సవం శనివారం సంబరంగా సాగింది. జగన్నాథగట్టులోని ఆ సంస్థ క్యాంపస్లోని కృష్ణ సెమినార్ హాల్లో మొత్తం 249 మంది విద్యార్థులకు అండర్ గ్రాడ్యుయేట్, పోస్ట్ గ్రాడ్యుయేట్, డ్యూయల్ డిగ్రీ, డాక్టరేట్లను అందజేశారు. ట్రిపుల్ఐటీడీఎం బోర్డు ఆఫ్ గవర్నర్స్ చైర్మన్ ఆచార్య ఎన్.వి రమణారావు అధ్యక్షత వహించిన కార్యక్రమానికి ప్రముఖ భారతీయ శాస్త్రీయ సంగీత విద్యాంసుడు, మృదంగ విద్యాంసుడు, పద్మశ్రీ డాక్టర్ యెల్లా వెంకటేశ్వరరావు ముఖ్య అతిథిగా హాజరైయ్యారు. పట్టాలను అందజేసిన తరువాత ప్రసంగించారు. క్రమ శిక్షణ, అంకిత భావం, పట్టుదలతో ఉన్నతస్థాయిని సాధించాలన్నారు. పట్టభద్రులు తమ జ్ఞానాన్ని, నైపుణ్యాలను సమాజ శ్రేయస్సు కోసం ఉపయోగించుకోవాలన్నారు.

# గొర్రెల మందపై కుక్కల దాడి

**చౌడేపల్లె :** మండలంలోని చౌడేశ్వరిదేవి పెద్దచెర్వులో మేత మేస్తున్న గొర్రెల మందపై కుక్కల గుంపు ఒక్కసారిగా దాడికి తెగబడిన ఘటన శనివారం జరిగింది. పెద్దకొండామర్రి పంచాయతీ నాగిరెడ్డిపల్లె మునివెంకటరమణారెడ్డికి చెందిన గొర్రెలను మేత కోసం చెరువులోకి తోలుకెళ్లాడు. గొర్రెలు మేత మేస్తుండగా ఒక్కసారిగా సుమారు పది కుక్కలు గొర్రెల మందపై విజృంభించాయి. గొర్రెల అరుపులు విన్న అతను కేకలు వేసినప్పటికీ కుక్కలు అతనిపై తిరగడడంతో చుట్టు పక్కల వారు గమనించి ఘటనా స్థలానికి చేరుకొన్నారు. అప్పటికే రూ.16 వేల విలువ చేసే ఒక గొర్రె మృతి చెందగా మరో నాలుగు గొర్రెలకు తీవ్ర గాయాలయ్యాయి. ప్రభుత్వం తమను ఆదుకోవాలని బాధితుడు కోరారు. జంతువులు, మనుషులపై వీధి కుక్కలు విచక్షణా రహితంగా దాడులు చేస్తున్నాయని, అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరారు.

# కుటుంబ ఆరోగ్యమే దేశ సౌభాగ్యం

**మదనపల్లె టౌన్:** కుటుంబ ఆరోగ్యమే దేశ సౌభాగ్యమని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ లక్ష్మీనరసయ్య అన్నారు. శనివారం 'ప్రపంచ జనాభా దినోత్సవం' సందర్భంగా మదనపల్లెలోని జిల్లా ఆస్పత్రి నుంచి నిర్వహించిన అవగాహన ర్యాలీని డీఎంహెచ్వో జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జూలై 11వ తేదీ నుంచి 18వ తేదీ వరకు జనాభా దినోత్సవ వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 'పిల్లల మధ్య వ్యవధి పాటిద్దాం – ఆరోగ్య వంతమైన, సంతోషకరమైన కుటుంబాన్ని నిర్మిద్దాం'అనే నినాదంతో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ మహమ్మద్ రఫీ మాట్లాటారు. జిల్లా ఆస్పత్రి నుంచి అనిబిసెంట్ సర్కిల్ వరకు ర్యాలీ నిర్వహించి ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో 104 నోడల్ అధికారి డాక్టర్ శ్రీధర్, యూపీహెచ్సీ వైద్యులు ఫరాఖాన్, డాక్టర్ విష్ణువర్ధన్ రెడ్డి, ఎస్ఓ ఓబుల్ రెడ్డి, డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్లు పాల్గొన్నారు.

# 'సర్' ప్రక్రియ వేగవంతం

**డిజిటలైజేషన్కు మిగిలింది**

**1.84 లక్షల ఓటర్లే**

**పెండింగ్లో పంపిణీ ఫారాలు 468**

**మదనపల్లె పెన్ పవర్, జూలై 11 :** జిల్లాలో స్పెషల్ ఇన్సెంటివ్ రివిజన్ (సర్) ప్రక్రియ వేగం పుంజుకుంది. జిల్లాలో 12,32,439 మందికి ఓటర్ ఫారాలు పంపిణీ చేయాల్సి ఉండగా శనివారం సాయంత్రం నాలుగు గంటల వరకు 12,31,971 మందికి (99.96 శాతం) పంపిణీ చేశారు. వీటిలో 10,47,610 ఓటర్ (85 శాతం) ఫారాల డిజిటలైజేషన్ పూర్తి చేశారు. ఓటరు ఫారాలు ఇంకా 468 పంపిణీ చేయాల్సి ఉండగా, 1,84,829 ఫారాల డిజిటలైజేషన్ మిగిలి ఉంది. ఈనెల ఎనిమిదవ తేది నుంచి 11వ తేది మధ్యలో 3,85,758 ఫారాలు డిజిటలైజేషన్ అయ్యాయి. సర్ కార్యక్రమం ముగిసేందుకు ఇక మిగిలింది కేవలం మూడురోజులే కావడంతో అధికార యంత్రాంగ ఏ మేరకు పూర్తి చేస్తుందో చూడాలి. ఫారాల పంపిణీ విషయంలో మదనపల్లె, పుంగనూరు నియోజకవర్గాల్లో వంద శాతం పూర్తి చేసినట్టు లెక్కలు చెబుతున్నాయి. ఫారాల డిజటలైజేషన్ విషయంలో రాయచోటి నియోజకవర్గం 87.47 శాతంతో ముందుంది, 83.09 శాతంతో పీలేరు నియోజకవర్గం వెనుకబడింది. ఫారాల పంపీణీలో నాలుగు మండలాలు మినహా మిగిలిన 21 మండలాల్లో వందశాతం పంపీణి పూర్తి చేశారు.

# రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

**మదనపల్లె పెన్ పవర్, జూలై 11 :** పెద్దమండెం మండలంలో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందాడు. పోలీసులు, మృతుని కుటుంబీకులు తెలిపిన వివరాల ప్రకారం.. సిద్దవరానికి చెందిన రవికుమార్ కుమారుడు కె.మంజునాథ్ (40) సొంత పనిపై బైకులో గుర్రంకొండకు వెళ్లాడు. పని ముగించుకుని తిరిగి వస్తుండగా మార్గంమధ్యలోని తురకపల్లి సమీపంలోని ఘాట్ రోడ్డులో ప్రమాదానికి గురై తీవ్రంగా గాయపడ్డాడు. కొన ఊపిరితో ఉన్న మంజునాథ్ను స్థానికుల సాయంతో హుటాహుటిన 108 అంబులెన్స్లో మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మార్గంమధ్యలోనే మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతదేహాన్ని చూసిన భార్య గుండెలవిసేలా విలపించింది. కుటుంబ సభ్యుల రోదనలు ఆస్పత్రి వద్ద మిన్నంటాయి. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్చురీకి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

# మదనపల్లె నవోదయలో 6వ తరగతికి ప్రవేశాలు

**ఉచితంగా కార్పొరేట్ స్థాయి విద్య**

**ఈ నెల 31వ తేదీ చివరి గడువు**

**– ఎం.గీత, ప్రిన్సిపాల్, నవోదయ విద్యాలయం, మదనపల్లె**

**మదనపల్లె పెన్ పవర్, జూలై 11 :** నవోదయ విద్యాలయంలో 6వ తరగతి ప్రవేశానికి ఈ నెల 31వ తేదీలోపు దరఖాస్తు ఆన్లైన్లో చేసుకోవాలి. నవంబర్ 28న ప్రవేశ పరీక్ష నిర్వహిస్తారు. అర్హత, ఆసక్తి గల విద్యార్థులు httpr:/// nv-av-oda ya.gov.in వెబ్సైట్లోకి వెళ్లి దరఖాస్తులను అప్లోడ్ చేసుకోవాలి.

# చెరువులో పడి వృద్ధుడి మృతి

**మదనపల్లె పెన్ పవర్, జూలై 11 :** బహిర్భూమికి వెళ్లిన వృద్ధుడు చెరువులో పడి మృతి చెందిన ఘటన మదనపల్లె మండలంలో చోటుచేసుకుంది. పోలీసులు, మృతుడి కుటుంబీకులు తెలిపిన వివరాల ప్రకారం.. వలసపల్లి గ్రామం మొలకల దిన్నెకు చెందిన ఉప్పుతోళ్ల వెంకటరమణ(68) మూడు రోజుల క్రితం బహిర్భూమికి గ్రామ సమీపంలోని చెరువు వద్దకు వెళ్లాడు. అక్కడి నుంచి తిరిగి ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు పలుచోట్ల గాలించారు. ఆచూకీ లభించకపోవడంతో ఆందోళన చెందారు. ఈ క్రమంలో శనివారం ఉదయం చెరువు నీటిలో వెంకటరమణ మృతదేహం తేలియాడుతూ కనిపించడంతో గ్రామస్తులు కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. ఫిర్యాదు మేరకు తాలూకా సీఐ కళా వెంకటరమణ ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. పంచనామా అనంతరం పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీకి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. మృతుడి భార్య పదేళ్ల క్రితమే చనిపోగా, ఒక కుమారుడు పట్టణంలో ఉంటున్నాడు. పెన్షన్తో జీవనం సాగిస్తున్న వెంకటరమణ మృతితో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు.

# బైక్ అదుపు తప్పి వ్యక్తికి గాయాలు

**సంబేపల్లె పెన్ పవర్, జూలై 11 :** మండల పరిధిలోని చిత్తూరు–కర్నూలు జాతీయ రహదారిపై శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో శివకుమార్ అనే వ్యక్తి గాయపడ్డ సంఘటన చోటు చేసుకొంది. శెట్టిపల్లె గ్రామం చిన్నజంగంపల్లెకు చెందిన శివకుమార్ ద్విచక్ర వాహనంలో రాయచోటి నుంచి స్వగ్రామానికి వెళుతుండగా అదుపు తప్పి పడిపోవడంతో తీవ్రంగా గాయపడినట్లు స్థానికులు తెలిపారు. బాధితుడిని 108 సాయంతో రాయచోటి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

# అందరి సహకారంతో లోక్ అదాలత్ విజయవంతం

**జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.కబర్ధి**

**కర్నూలు పెన్ పవర్, జూలై 11 :** గడిచిన పక్షం రోజులు న్యాయవాదులు, పోలీసు అధికారులు, ఇతర ప్రభుత్వ శాఖల అధికారుల సహకారంతో ప్రీ లోక్ అదాలత్ క్యాంపులు నిర్వహించి విజయవంతం చేసి అధిక కేసులు పరిష్కార దిశగా సహకరించారని జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.కబర్ధి అన్నారు. శనివారం ఉదయం జాతీయ లోక్ అదాలత్ ప్రారంభోత్సవం సందర్భంగా ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఆయా కోర్టులలో 31 లోక్ అదాలత్ బెంచీలు ఏర్పాటు చేసి కేసుల పరిష్కారానికి ఏర్పాట్లు చేశామన్నారు. బ్యాంకులు, బీమా సంస్థలు ముందుకొచ్చి కేసుల పరిష్కారానికి తోడ్పాటునందించాయన్నారు. శ్రీశైలం ముంపు రైతులకు పెండింగ్ కేసుల్లో నష్టపరిహారం అందేలా చర్యలు తీసుకున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ముంపు రైతులకు రూ.2.50 కోట్ల విలువైన చెక్కులను జిల్లా ప్రధాన న్యాయమూర్తి కబర్ధి చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీ కోర్టు న్యాయమూర్తి పి.వాసు, సీబీఐ కోర్టు జడ్జి శోభారాణి, మహిళా కోర్టు జడ్జి లక్ష్మీరాజ్యం, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బీఎల్వీ శేషాద్రి, జూనియర్ సివిల్ జడ్జిలు సరోజనమ్మ, అనిల్, అనూష, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు చంద్రుడు తదితరులు పాల్గొన్నారు.

